క్లుప్తంగా

కూలిన రైస్ మిల్లు గోడ



కూలిన గోడ

బొబ్బిలి: ఇటీవల కురిసిన వర్షాలకు పాత బొబ్బిలిలోని ఓ రైస్‌మిల్లు గోడ బుధవారం కూలిపోయింది. వర్షాలకు బాగా నానిపోవడంతో గోడ కూలిపోయిందని మిల్లు యజమాని అడపా యోగేశ్వరరావు తెలిపారు. అయితే ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

ఓటీపీ చెప్పాలి..

బొబ్బిలి: గ్యాస్ వినియోగదారులు ఇకపై ఓటీపీ నంబర్ చెప్పిన తర్వాతే డెలివరీ బాయ్ సిలిండర్ ఇస్తాడని స్థానిక హెచ్‌పీ గ్యాస్ డీలర్ జలగం ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్యాస్ బుక్ చేసుకున్న తర్వాత సంబంధిత నంబర్‌కు వచ్చే ఓటీపీ చెప్పాలని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయం గమనించాలని కోరారు.

68 మందికి నేత్ర పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రత్న

బొబ్బిలి రూరల్: మండలంలోని పిరిడిలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 68 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్పంచ్ తుట్టు వరలక్ష్మి ఇంటివద్ద జరిగిన శిబిరంలో ఆప్తాలమిస్ట్ రత్న రోగులను పరీక్షించి, 32 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బొబ్బిలి రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన పప్పల నారాయణ కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బేబీ నాయన రూ. పది వేల ఆర్థిక సాయం ప్రకటించారు. దీంతో నగదును స్థానిక టీడీపీ నాయకులు రౌతు రామ్మూర్తినాయుడు, తదితరులు బాధితుడు నారాయణకు బుధవారం అందజేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి..



చెరువు గట్టుపై మొక్క నాటుతున్న సర్పంచ్ వసుంధర

బొబ్బిలి రూరల్: వాతావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కమ్మవలస గ్రామ సర్పంచ్ పిల్లా వసుంధర అన్నారు. మండలంలోని కమ్మవలసలో సర్పంచ్ వసుంధర బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్లోబల్ వార్మింగ్ కారణంగా వాతావరణం సమతుల్యత కోల్పోతుందన్నారు. ఈ నేపథ్యంలో పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో పిల్లా భాస్కరరావు, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా నిలిపివేత

బొబ్బిలి: పట్టణంలోని పోలీస్‌స్టేషన్, చీపురుపల్లి వీధి, టీటీడీ కల్యాణ మండపం ప్రాంతాల్లో గురువారం తాగునీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాల్వ్‌లు మారుస్తున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా మారిన పశువైద్య కేంద్ర భవనం

తెర్లాం: మండలంలోని నెమలాం పశువైద్య కేంద్ర భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా భవనమంతా కారిపోయి ప్రమాదకరంగా తయారైంది. దీంతో విధులు నిర్వహించడానికి సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారు. ఇటీవల నెమలాం గ్రామానికి వచ్చిన బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు(బేబీ నాయన) పశు వైద్య కేంద్ర భవనాన్ని పరిశీలించారు. కొత్త భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కొత్త భవనం నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

బై బై వినాయక..



బాడంగి: ముగడ చేనేత కాలనీలో ట్రాక్టర్‌పై వినాయకుడ్ని ఊరేగిస్తున్న భక్తులు



రామభద్రపురం : వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

ఎంతో భక్తిశ్రద్ధలతో పూజించిన వినాయక విగ్రహాలను మేళతాళాల నడుమ భక్తులు మంగళ, బుధవారాల్లో నిమజ్జనం చేశారు. మంటపాల్లో కొలువుదీరిన విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రత్యేక వాహనాల్లో ఉంచి పురవీధుల్లో ఊరేగించి చెరువులు, నదుల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువత నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

– బాడంగి/రామభద్రపురం

గణపతి నిమజ్జనంలో జాగ్రత్తలు తప్పనిసరి



హెచ్.ఉపేంద్ర, సీఐ

రాజాం: వినాయకుని నిమజ్జనోత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరగాలని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర అన్నారు. రాజాంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. నిమజ్జనం చేసే ప్రాంతాన్ని ముందుగా గ్రామపెద్దల సమక్షంలో కమిటీ గుర్తించాలని సూచించారు. లోతట్టు చెరువులు, కాలువలు, నదుల్లో నిమజ్జనం చేయరాదని హెచ్చరించారు. ఊరేగింపు సమయంలో పెద్ద పెద్ద సౌండు ఇచ్చే డీజేలు పెట్టడం చట్టవిరుద్ధమని అన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలిగించేలా ప్రతిమల ఊరేగింపు చేయడం, అశ్లీల ప్రదర్శనలు వంటివి నిర్వహించడం చేస్తే కమిటీ సభ్యులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గతంలో వినాయకుని నిమజ్జనం చేసిన ప్రదేశాలు, లోతు తక్కువగా ఉన్న చెరువుల్లో ప్రతిమలు నిమజ్జనం చేయాలని వెల్లడించారు. చిన్నారులు, మహిళలు నిమజ్జన ప్రాంతాలకు వెళ్లరాదని సూచించారు.

17న జాతీయ నులిపురుగుల నివారణ దినం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ రమామణి, తదితరులు

రామభద్రపురం: మండలంలో ఈ నెల 17న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినం విజయవంతం చేయాలని ఎంపీడీఓ రమామణి తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలు, రామమందిరాల వద్ద రెండు నుంచి 19 ఏళ్ల మధ్య వయసువారికి మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆరికతోట పీహెచ్‌సీ ఈఓ మల్లిక్, రామభద్రపురం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ వాసుదేవరావు, ఎంఈఓ తిరుమలప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పత్ర కషాయంతో చీడపీడల నివారణ



గోవిందపురంలో పత్ర కషాయం తయారు చేస్తున్న రైతులు

సంతకవిటి: పత్ర కషాయంను వాడడం ద్వారా పంటలలో చీడపీడలను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణ అన్నారు. మండలంలోని గోవిందపురం గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయం, పత్ర కషాయాల తయారీ, వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపాలన్నారు. ఈ విధానంలో తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు పొందవచ్చన్నారు. పత్ర కషాయం తయారీకి 200 లీటర్ల నీరు, జిల్లేడు ఆకులు, వేప, మునగ, కలబంద, ముష్టి ఆకు, తూటికాడ, జామ, నిమ్మ ఆకులు, 10లీటర్ల ఆవు మూత్రంను నాలుగు రోజులు డ్రమ్ములో ఉంచిన తరువాత వచ్చిన కషాయంను పంటలపై పిచికారీ చేయాలని సూచించారు. దీని వల్ల పంటలలో చీడపీడలు నివారణ అవడంతో పాటు మొక్క ఎదుగుదలకు తోడ్పడుతుంది.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



వన్నలిలో ప్రకృతి వ్యవసాయ పంటలు పరిశీలిస్తున్న అధికారులు

రేగిడి: రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగుచేస్తే లాభదాయకంగా ఉండడంతో పాటు మంచి దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం ఎల్2 గౌరీశ్వరరావు అన్నారు. మండలంలో ఉప్పర్నాయుడువలస, గుళ్లపాడు, ఉంగరాడ, వన్నలి తదితర గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న పంటలను బుధవారం పరిశీలించారు. నాట్లు వేసినప్పటి నుంచి కోతలు చేసే వరకూ ఎటువంటి రసాయనాలు, పురుగు మందులు వినియోగించకుండా కషాయాల ద్వారానే పంటలు పండించడం వీటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు తవిటినాయుడు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన



పాతచెలికానివలసలో ముంపునకు గురైన పంటలను పరిశీలిస్తున్న ఏఓ మురళీకృష్ణ

రేగిడి: వరదల కారణంగా ముంపునకు గురైన పంటపొలాలను మండల వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ బుధవారం పరిశీలించారు. ఖండ్యాం, వెంకటాపురం, కొమెర, పాతచెలికానివలస, కొత్త చెలికానివలస, వెంకమపేట, ఏపీపురం తదితర గ్రామాల్లో పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పొలాల్లో చేరిన అధిక నీటిని వెంటనే బయటకు తీసివేసి, ఎకరాకు 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ చొప్పున వేసుకోవాలని సూచించారు. ఏపీపురం, అంబాడ, నాయిరాలవలస గ్రామాల్లో కొంతమేర వరదనీటిలోనే పంటపొలాలు ఉన్నట్లు ధ్రువీకరించారు.

సచివాలయాల్లోనే ఇసుక బుకింగ్

- మైనింగ్ ఆర్ఐ శ్యామ్ పీటర్



సమావేశమైన అధికారులు

బొబ్బిలి రూరల్: గ్రామ సచివాలయాల ద్వారా ఇకపై ఇసుక బుక్ చేసుకోవచ్చని భూగర్భ గనులశాఖ ఆర్ఐ శ్యామ్ పీటర్ తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి రాకుండా స్థానికంగా అందుబాటులో ఉన్న సచివాలయాలకు వెళ్లి అవసరమైన ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు.

సిద్ధంగా ఉండాలి..

ఓపెన్ ఇసుక రీచ్‌ల నిర్వహణకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీను సూచించారు. మడ్డువలస డ్యామ్ నుంచి ఇసుకను బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లోని స్టాక్ పాయింట్‌కు తరలిస్తామని, అందుకు అవసరమైన శిక్షణను సిబ్బందికి ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే కుసుమూరు గ్రామం వద్ద ఇసుక సేకరణకు ప్రభుత్వం అనుమతినిచ్చిందని చెప్పారు. సమావేశంలో మండల అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలు పూర్తిచేయాలి

రాజాం సిటీ: మండలంలోని వివిధ శాఖల్లో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామి సిబ్బంది, ఇంజినీరింగ్, హౌసింగ్, ఉద్యానవనశాఖ సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి సిబ్బంది హౌసింగ్‌లో వంద రోజుల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు.

రేగిడి ఎస్ఐగా నీలావతి



రేగిడి: మండల ఎస్ఐగా పి.నీలావతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరావు ఇచ్ఛాపురం బదిలీ కావడంతో ఆయన స్థానంలో విజయనగరం మహిళా పోలీస్ విభాగం నుంచి నీలావతి బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం స్టేషన్ సిబ్బందితో సమీక్షించారు. మండలంలో లా అండ్ ఆర్డర్‌పై ఆరాతీశారు.

పంటకోత ప్రయోగాలు ప్రణాళికతో చేపట్టాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ధర్మరాజు

వంగర: పంటకోత ప్రయోగాలు ప్రణాళికబద్ధంగా చేయాలని తహసీల్దార్ డి.ధర్మరాజు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా వరిపంట సాగు, పంటకోత ప్రయోగాల లక్ష్యాలను నిర్దేశించారు. ప్రధాన మంత్రి పంటల బీమా యోజన పథకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏవో తట్టికోట కన్నబాబు, ఏఎస్‌వో పాల్గొన్నారు.

అంకితభావంతోనే గుర్తింపు



శ్రీరాములును సత్కరిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

రాజాం సిటీ: అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులకు ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని ఎంపీటీసీ బి.కాంతారావు అన్నారు. మండలంలోని మొగిలివలస ఎంపీపీ పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మొయ్యి శ్రీరాములను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడం ద్వారా ఉపాధ్యాయులకు గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ రమణమ్మ, లెంక గణనాథ, రమేష్, సూర్యనారాయణ, తవుడు, ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా నాగావళి



శివ్వాం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నాగావళి

వంగర: మండల పరిధిలో నాగావళి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వీవీఆర్ పేట, రాజులగుమ్మడ, రుషింగి, తగాం, శివ్వాం, సంగాం తదితర గ్రామాల వద్ద నాగావళి ఉధృతంగా ప్రవహించడంతో పడవలు నడపొద్దని, చేపలు వేటకు దిగవద్దని పోలీస్, రెవెన్యూ సిబ్బంది ప్రజలను హెచ్చరించారు.

సీజనల్ జ్వరాలపై అప్రమత్తం

రాజాం: ప్రజలు సీజనల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి సిద్ధీశ్వరి అన్నారు. మండలంలో అమరాం గ్రామంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ప్రబలుతున్న విషజ్వరాలు, అంటువ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఫాస్ట్‌ఫుడ్స్ అధికంగా తినవద్దని, ఈగలు వాలిన పదార్థాలను తీసుకోవద్దని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చిన పలువురు రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఏఎన్‌ఎంలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింట ఫీవర్ సర్వే చేపట్టారు.

సిరిపురంలో స్కూల్ గేమ్స్



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

సంతకవిటి: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 300 మంది బాలురు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎంఈఓ సీహెచ్.భాస్కరరావు, హెచ్‌ఎం వి.వెంకటరావు పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, బ్యాడ్మింటన్, రన్నింగ్ తదితర క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. గురువారం బాలికలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పీడీ సన్నిబాబు తెలిపారు.

గోతుల రహదారికి తాత్కాలిక మరమ్మతులు



కొండ గ్రావెల్ వేసి జేసీబీతో తాత్కాలికంగా గోతులు పూడుస్తున్న దృశ్యం

తెర్లాం: పూర్తిగా గోతులమయమై కనీసం ద్విచక్ర వాహనాలు కూడా నడపలేని దుస్థితిలో ఉన్న రోడ్డుకు తెర్లాం, మెరకముడిదాం పోలీసులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. రాజాం – రామభద్రపురం ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఎంఆర్ అగ్రహారం దాటిన తర్వాత నుంచి ఉత్తరావల్లి జంక్షన్ వరకు ఉన్న రోడ్డు పూర్తిగా గోతులతో నిండిపోయింది. పెద్ద పెద్ద గోతులేర్పడడంతో లారీలు సైతం బోల్తా పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 9న సాక్షి దినపత్రికలో 'ఆ రోడ్డులో ప్రయాణం నరకమే..' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో తెర్లాం, మెరకముడిదాం పోలీసులు స్పందించి బుధవారం మరమ్మతులు చేపట్టారు. కొండ గ్రావెల్ తీసుకువచ్చి జేసీబీ సహాయంతో గోతులు పూడ్చారు. పోలీసులు స్పందించి సమస్య పరిష్కరించారు తప్ప, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు భీమవరంలో గ్రామసందర్శన

బాడంగి: మండలంలోని భీమవరంలో గ్రామసందర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల నోడల్ ఆఫీసర్ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో జరుగనున్న ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులంతా విధిగా హాజరుకావలని కోరారు.

5వ వార్డులో..

బొబ్బిలి: మున్సిపాలిటీలోని ఐదో వార్డులో వార్డు సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎల్. రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో వార్డులోని అగురువీధి సచివాలయం వద్దకు మున్సిపల్, సచివాలయం సిబ్బంది హాజరుకావాలని కోరారు.

రంగరాయపురంలో..

బొబ్బిలి రూరల్: మండలంలోని రంగరాయపురంలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి. రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నోడల్ ఆఫీసర్ పి. మధుసూదనరావు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

వెలగవలసలో..

తెర్లాం: మండలంలోని వెలగవలసలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు హాజరుకానున్నారని పేర్కొన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులతో పాటు మండలంలోని అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోండి..

- అంబేడ్కర్ పోరాట సమితి అధ్యక్షుడు సోరు సాంబయ్య



తహసీల్దార్ ఎం. శ్రీనుకు వినతిపత్రం అందిస్తున్న సోరు సాంబయ్య

బొబ్బిలి రూరల్: వందేళ్ల చరిత్ర ఉన్న సీబీఎం బాలికల ఉన్నత పాఠశాల రికార్డులను తారుమారు చేసిన రెవెన్యూ అధికార, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ పోరాట సమితి అధ్యక్షుడు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీనును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సాంబయ్య విలేకరులతో మాట్లాడుతూ, ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యనందిస్తున్న చారిత్రాత్మక పాఠశాలను మూసి వేసి విక్రయించడం దారుణమన్నారు. ట్రస్ట్ పేరిట ఉన్న స్థలాన్ని వేరేవారి పేరు మీద మార్చేందుకు రికార్డులు తారుమారు చేసిన అప్పటి తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్, తదితర సిబ్బంది చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చీపురుపల్లి, బొబ్బిలి సబ్ రిజిస్ట్రార్‌ల ప్రమేయం కూడా ఉందని ఆరోపించారు. 5671,72పై 2023 డాక్యుమెంట్ నంబర్లతో రిజిస్టర్ కాబడిన సీబీఎం పాఠశాల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరారు. ఆయనతో పాటు వినియోగదారుల సంఘ ప్రతినిధి లంక భాస్కరరావు, తదితరులున్నారు.

ఇంగువ ద్రావణంతో కుళ్లుతెగులు నివారణ



ఇంగువ ద్రావణం తయారీ విధానాన్ని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం: తుఫానుల కారణంగా ఏర్పడిన అధిక వర్షాలకు వరి పంటలో కుళ్లుతెగులు వచ్చే ప్రమాదం ఉందని వ్యవసాయశాఖ అధికారి ఎ.రేణుకాసాయి, ప్రకృతి వ్యవసాయం ఎల్‌వన్ పి.రమాదేవి అన్నారు. మండలంలో కొతారిపురం గ్రామంలో బుధవారం పర్యటించి పంటలను పరిశీలించారు. వరిలో కుళ్లుతెగులు నివారణకు ప్రకృతి వ్యవసాయ విధానంలో వినియోగించే పేడమూత్రం–ఇంగువ ద్రావణం తయారీని వివరించారు. ఐదు కిలోల పేడ, ఐదు లీటర్లు ఆవు మూత్రం, ఐదు లీటర్లు నీటిని కలిపి నాలుగురోజులు మురగబెట్టాలని తెలిపారు. అనంతరం ఐదో రోజు వంద గ్రాముల ఇంగువ కొంచెం వేడి నీటిలో కలిపి, ముందుగా మురగబెట్టి ఉంచిన మిశ్రమ ద్రాణంలో కలపాలని సూచించారు. ఈ ద్రావణాన్ని వంద లీటర్ల నీటిలో కలిపి ఎకరా విస్తీర్ణంలో పిచికారీ చేస్తే కుళ్లుతెగులు నివారణతో పాటు బాక్టీరియా, శిలీంద్రాలకు బాగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ టి.అరుణ, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రేరణ



ప్రాంతీయ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

రాజాం సిటీ: పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు పట్టణంలో 101 మొక్కలు నాటి పలువురికి ప్రేరణగా నిలుస్తున్నాడని ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కరణం హరిబాబు అన్నారు. బుధవారం ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని మొక్కలు నాటినట్లు తెలిపారు. ఇప్పటికే రాజాం పట్టణాన్ని పర్యావరణహితంగా మార్చేందుకు నడుం బిగించడం అభినందనీయమని అన్నారు. అందులో భాగంగా ఇప్పటి వరకు 1200లకు పైగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తలే రాజేష్, తదితరులు

రేగిడి: మండలంలో అంబాడ గ్రామానికి చెందిన మాజీ గ్రామ వలంటీర్ తూలుగు వెంకటేష్ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ బుధవారం పరామర్శించారు. ఇటీవల వెంకటేష్ ప్రమాదవశాత్తు సాగునీటికాలువలో జారిపడి మృతిచెందిన విషయంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంకటేష్ తల్లిదండ్రులు లక్ష్మి, సింహాచలంతో పాటు సోదరులను పరామర్శించి, ఓదార్చారు. వెంకటేష్ కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్‌లు లెంక రాంబాబు, చుక్క వెంకటినాయుడు, కరణం శ్రీనివాసరావు, పాలవలస దవళేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ రుంకు కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.